# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 96 | పేజీలు : 08 | సోమవారం | 13-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


# 'దోచుకో-దాచుకో'



**రాష్ట్రంలో కాంగ్రెస్ 'దోచుకో-దాచుకో' పథకం నడిపిస్తోంది: కేటీఆర్ తీవ్ర విమర్శలు**

**సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన సీఎం అంటూ కేటీఆర్ ఫైర్**

**తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చీకటి దోస్తీ చేస్తున్నాయంటూ వ్యాఖ్యలు**

**సింగరేణిలో అవినీతి ఆపకపోతే ప్రతి బొగ్గు గనిపై అగ్గిపుట్టిస్తామని హెచ్చరిక**

**సింగరేణి కుంభకోణంపై కేంద్రం విచారణ జరపడం లేదని ఆగ్రహం**

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 'దోచుకో-దాచుకో' అనే కొత్త పథకాన్ని ప్రారంభించిందని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ అవినీతి, దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఎన్నికైన బీఆర్ఎస్ కౌన్సిలర్ల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అంతటి భారీ అవినీతిపరుడైన ముఖ్యమంత్రి దేశంలోనే మరొకరు లేరని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగల్లా మారి ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని కేటీఆర్ ఆరోపించారు.

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ
# పనులపై ప్రభుత్వం శరవేగంగా చర్యలు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్



కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులపై తమ ప్రభుత్వం శరవేగంగా చర్యలు చేపట్టిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ సచివాలయంలో కాళేశ్వరం బ్యారేజీలపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. బ్యారేజీల్లో తీవ్రమైన లోపాలను ఎన్డీఎస్ఏ అధికారులు గుర్తించారని తెలిపారు. 2027 నుంచి 2028 వరకు బ్యారేజీల

2 **మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం : ఎంపీ అరవింద్..**

**ఉనికి కోసం ఇరాన్ పోరాటం** 2

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

## సప్లిమెంటరీ పరీక్షల
# షెడ్యూల్ విడుదల



**తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల**

**మే 13 నుంచి 21 వరకు థియరీ పరీక్షల నిర్వహణ**

**మే 22 నుంచి 25 వరకు ప్రాక్టికల్ పరీక్షలు**

**ఉదయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు**

**ఒకేషనల్ కోర్సులకు కూడా ఇదే షెడ్యూల్ వర్తింపు**

# 2029లోపే మహిళా రిజర్వేషన్లు..

**మద్దతు కోరుతూ పార్టీలకు ప్రధాని మోదీ లేఖ**

**మహిళా రిజర్వేషన్ల అమలుపై ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి**

**2029 ఎన్నికలలోపే అమలు చేసేందుకు సన్నాహాలు**

**మద్దతు కోరుతూ పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధాని లేఖ**

**ఈ నెల 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు**

**2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్ల ప్రతిపాదన**

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించే "నారీశక్తి వందన్ అధినియం" (మహిళా రిజర్వేషన్ బిల్లు) అమలు దిశగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక ముందడుగు వేశారు. 2029 సార్వత్రిక ఎన్నికలలోపే మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు వీలుగా, ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని కోరుతూ లోక్‌సభ, రాజ్యసభలోని అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ఆయన లేఖ రాశారు. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లుపై చారిత్రక చర్చ జరగనుందని, దీని ఆమోదానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందడం ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తుందని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. "ఏప్రిల్ 16 నుంచి నారీశక్తి వందన్ అధినియంపై పార్లమెంట్‌లో చారిత్రక చర్చ జరగనుంది. ఇది మన ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం

## చైనాకు ట్రంప్ 'సీరియస్'
# వార్నింగ్



**ఇరాన్‌కు ఆయుధాలిస్తే భారీ మూల్యం తప్పదని హెచ్చరిక**

**సైనిక చర్య, ఆర్థిక ఆంక్షలు తప్పవని స్పష్టం చేసిన అమెరికా**

**ఆరోపణలను ఖండించిన చైనా.. ఆయుధాలు పంపలేదని వివరణ** 2

హైదరాబాద్ పల్స్,డెస్క్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌కు రహస్యంగా ఆయుధాలు సరఫరా చేయడాన్ని వెంటనే ఆపకపోతే, భారీ మూల్యం

# రేవంత్ రెడ్డి పేదల ఇళ్లు కూలగొడుతున్నారు..

**హరీశ్‌రావు ధ్వజం**



హైదరాబాద్ పల్స్,సిద్దిపేట

సీఎం రేవంత్ రెడ్డి పేదల ఇళ్లు కూలగొడుతున్నారని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పేదల బతుకులు, ఇళ్లు కూల్చడానికి హైడ్రా తెచ్చారని ధ్వజమెత్తారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ పాలన ఏంటో రాష్ట్ర ప్రజలకు అర్థమైందని విమర్శించారు. రేవంత్ రెడ్డి కొత్త పథకాలు ఇవ్వలేదని, కేసీఆర్ హయాంలో ఉన్నవాటిని బంద్ చేశారని ఆగ్రహించారు. గ్రామసభలు, వార్డు సభల్లో కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీస్తున్నారని అన్నారు. తెలంగాణ ఆరు గ్యారంటీలు అమలు చేశామని కేరళ

## ప్రముఖ గాయని
# ఆశా భోంస్లే
## మృతిపై సీఎం రేవంత్ విచారం..



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ప్రముఖ గాయని ఆశా భోంస్లే మరణంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆదివారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ఆశా భోంస్లే మరణం దేశంలోని సాంస్కృతిక, కళారంగాలకు తీరని లోటు. భారతీయ సంగీత రంగానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. ఆశా కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రపంచానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆశా ఆత్మకు

# సంగారెడ్డిలో పేలుళ్లు..
## పలువురికి తీవ్ర గాయాలు

2



హైదరాబాద్ పల్స్,సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో గ్యాస్ సిలిండర్ పేలుళ్లతో రెండు వేర్వేరు చోట్ల ప్రమాదాలు చోటుచేసుకుని తీవ్ర కలకలం రేపాయి. ఈ ఘటనల్లో పలువురు గాయపడగా, ఇళ్లకు భారీ నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కల్వకుంట్లలో తీవ్ర పేలుడు..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలోని కల్వకుంట్ల ప్రాంతంలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. పేలుడు తీవ్రతకు ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోగా, గోడలు పగిలిపోయాయి. ఇంట్లో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన

# 2029లోపే మహిళా రిజర్వేషన్లు..

మొదటి పేజీ రువాయి

చేయడానికి ఒక గొప్ప అవకాశం. అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్న మన సమష్టి నిబద్ధతను చాటుకోవాల్సిన సమయం ఇది” అని మోదీ పేర్కొన్నారు. జాతి నిర్మాణంలో మహిళల పాత్రను ప్రశంసిస్తూ, వారు నిర్ణయాధికారంలో చురుకైన పాత్ర పోషించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. 2023లో పార్టీలకు అతీతంగా ఎంపీలందరూ ఈ బిల్లుకు మద్దతు పలికిన క్షణాలను ప్రధాని గుర్తుచేశారు. దేశ మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి అందరూ ఏకతాటిపై నిలిచిన ఆ సందర్భం చిరస్మరణీయమని అన్నారు. అయితే, రిజర్వేషన్ల అమలు సమయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన నేపథ్యంలో, నిపుణులు, రాజకీయ పార్టీలతో విస్తృత చర్చల అనంతరం ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చిందని తెలిపారు.ప్రస్తుత ప్రతిపాదన ప్రకారం మహిళా రిజర్వేషన్ల అమలును 2027 జనాభా లెక్కలతో ముడిపెట్టకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగానే చేపట్టాలని కేంద్రం భావిస్తోంది. దీనివల్ల 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళా కోటాను అమలు చేయడం సాధ్యమవుతుంది. “దేశవ్యాప్తంగా నారీశక్తి వందన్ అధినియం స్ఫూర్తిని అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఇది మన ప్రజాస్వామ్య వ్యవస్థలకు కొత్త శక్తినిస్తుంది” అని మోదీ తన లేఖలో వివరించారు.ఇది ఏ ఒక్క పార్టీకో, వ్యక్తికో సంబంధించిన అంశం కాదని, మహిళలు, భావి తరాల పట్ల మనందరి బాధ్యత అని ప్రధాని అన్నారు. ఈ చారిత్రక ఘట్టంలో పాలుపంచుకునే అవకాశం వదులుకోవద్దని, ఈ సవరణకు మద్దతు ఇవ్వడం ద్వారా మన ప్రజాస్వామ్య సంప్రదాయాలను మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కాబట్టి, ప్రతిపక్షాల మద్దతు ఈ బిల్లు ఆమోదానికి అత్యంత కీలకం కానుంది.

# చైనాకు ట్రంప్ ‘సీరియస్’ వార్నింగ్

మొదటి పేజీ రువాయి

చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.“మా శత్రువులకు మీరు ఆయుధాలు ఇస్తే, మేం మిమ్మల్ని వదిలిపెట్టబోం” అని ట్రంప్ ఘాటుగా హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాను అడ్డుకోవాలన్న ఇరాన్ ప్రయత్నాలకు సహకరించే దేశాలపైనా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన సంకేతాలిచ్చారు.ఇరాన్‌తో సంబంధాలు కొనసాగించే చైనా కంపెనీలపై ఆర్థిక ఆంక్షలు విధించడంతో పాటు, అంతర్జాతీయ బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి బహిష్కరిస్తామని కూడా ట్రంప్ హెచ్చరించారు. కాల్పుల విరమణ అమలులో ఉన్న సమయంలో ఇరాన్ కు చైనా సైనిక సహకారం అందించడం తమ బలగాలకు ముప్పుగా పరిణమించనుందని అమెరికా భావిస్తోంది.అయితే, ట్రంప్ ఆరోపణలను చైనా తీవ్రంగా ఖండించింది. తమపై నిరాధార నిందలు వేస్తున్నారని పేర్కొంది. ఈమేరకు అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేస్తూ.. పశ్చిమాసియా సంక్షోభంలో పాల్గొన్న ఏ దేశానికీ తాము ఎలాంటి ఆయుధాలు సరఫరా చేయలేదని వివరించింది. సెన్సేషనలిజం కోసమే కొన్ని మీడియా సంస్థలు తమపై నిరాధార ఆరోపణలతో కథనాలు ప్రసారం చేస్తున్నాయని విమర్శించింది.

## ప్రముఖ గాయని
# ఆశా భోంస్లే
## మృతిపై సీఎం రేవంత్ విచారం..

మొదటి పేజీ రువాయి

శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా’ అని అన్నారు.

ఆశా భోంస్లే గొంతు అమరం: మంత్రి కోమటిరెడ్డి

లెజెండరీ గాయని ఆశా భోంస్లే మరణంపై రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆశా భోంస్లే మరణం కేవలం సినీ రంగానికే కాకుండా, యావత్ సంగీత ప్రపంచానికి తీరని లోటన్నారు. ఏడు దశాబ్దాలకు పైగా వేల సంఖ్యలో పాటలు పాడి.. సంగీత ప్రియులను అలరించిన ఆమె గొంతు అమరం అంటూ కీర్తించారు. ఆశా భోంస్లే శాస్త్రీయ సంగీతం నుంచి పాప్ సాంగ్స్ వరకు, అన్ని భాషల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప గాయని అన్నారు. సంగీత రంగంలో ఆమె సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆమెను ‘దాదాసాహెబ్ ఫాల్కే’, ‘పద్మ విభూషణ్’ వంటి అత్యున్నత పురస్కారాలతో గౌరవించిందని గుర్తు చేశారు.

# సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల

మొదటి పేజీ రువాయి

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ముఖ్య గమనిక. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు, 2026 మే/జూన్ కు సంబంధించిన టైమ్‌టేబుల్‌ను తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. జనరల్, ఒకేషనల్ కోర్సులకు చెందిన ఫస్టియర్, సెకండియర్ విద్యార్థుల కోసం ఈ షెడ్యూల్‌ను ప్రకటించింది. థియరీ పరీక్షలు మే 13వ తేదీ నుంచి ప్రారంభమై మే 21వ తేదీన ముగుస్తాయి.ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రాక్టికల్ పరీక్షలను మే 22 నుంచి 25 వరకు రెండు సెషన్లలో (ఉదయం 9-12, మధ్యాహ్నం 2-5) నిర్వహిస్తారు. మే 26న ఇంగ్లీష్ ప్రాక్టికల్, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షలు, మే 28న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష జరగనుంది.

థియరీ పరీక్షల పూర్తి షెడ్యూల్:

మే 13 (బుధవారం): సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 (ఫస్టియర్); సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2 (సెకండియర్)

మే 14 (గురువారం): ఇంగ్లీష్ పేపర్-1 (ఫస్టియర్); ఇంగ్లీష్ పేపర్-2 (సెకండియర్)

మే 15 (శుక్రవారం): మ్యాథ్స్-1ఎ, బోటనీ-1, పొలిటికల్ సైన్స్-1 (ఫస్టియర్); మ్యాథ్స్-2ఎ, బోటనీ-2, పొలిటికల్ సైన్స్-2 (సెకండియర్)

మే 16 (శనివారం): మ్యాథ్స్-1బీ, జువాలజీ-1, హిస్టరీ-1 (ఫస్టియర్); మ్యాథ్స్-2బీ, జువాలజీ-2, హిస్టరీ-2 (సెకండియర్)

మే 18 (సోమవారం): ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1 (ఫస్టియర్); ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2 (సెకండియర్)

మే 19 (మంగళవారం): కెమిస్ట్రీ-1, కామర్స్-1 (ఫస్టియర్); కెమిస్ట్రీ-2, కామర్స్-2 (సెకండియర్)

మే 20 (బుధవారం): పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్-1 (ఫస్టియర్); పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్-2 (సెకండియర్)

మే 21 (గురువారం): మోడరన్ లాంగ్వేజ్-1, జాగ్రఫీ-1 (ఫస్టియర్); మోడరన్ లాంగ్వేజ్-2, జాగ్రఫీ-2 (సెకండియర్)

ఈ తేదీలు ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు కూడా వర్తిస్తాయని, అయితే వారికి సంబంధించిన పూర్తి టైమ్‌టేబుల్‌ను ప్రత్యేకంగా విడుదల చేస్తామని బోర్డు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

# రేవంత్ రెడ్డి పేదల ఇళ్లు కూలగొడుతున్నారు..

మొదటి పేజీ రువాయి

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. కేసీఆర్ రాకముందు 23 లక్షల పెన్షన్లు ఉండేవని.. కేసీఆర్ వచ్చాక 20 లక్షలు పెంచి మొత్తం 43 లక్షలకు పెన్షన్లు ఇచ్చారని ప్రస్తావించారు. రేవంత్ రెడ్డిది ఇంట్లో ఈగల మోత, బయట పల్లకి మోత అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే, ఉత్త ముచ్చట్లేనని సెటైర్లు గుప్పించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఏ మొహం పెట్టుకుని వస్తారని ప్రశ్నించారు. సిద్దిపేట అభివృద్ధిలో రాష్ట్రానికి ఆదర్శమని ఉద్ఘాటించారు. రేవంత్ రెడ్డికి సిద్దిపేట అంటే పగ, కుట్ర అని హరీశ్‌రావు ఆరోపించారు.

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ
# పనులపై ప్రభుత్వం శరవేగంగా చర్యలు

మొదటి పేజీ రువాయి

పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామని అన్నారు. AFRYఇండియా -IIT ముంబైకి డిజైన్ బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేశారు. CWPRS కు అత్యున్నత ప్రాధాన్యమని.. 45 రోజుల పరీక్షలు ఉంటాయని తెలిపారు. స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తామని.. వారానికి రెండుసార్లు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఎల్ అండ్ టీ సహా సంస్థలకు క్యాంపులు రీ యాక్టివేట్ చేయాలని ఆదేశించారు. అన్ని పరీక్షలు సంయుక్తంగా నిర్వహించాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచనలు చేశారు.

# ‘దోచుకో-దాచుకో’

మొదటి పేజీ రువాయి

“సింగరేణిలో వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగుతున్నా, 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఉలుకూపలుకూ లేకుండా మౌనంగా ఉంది. దీనిపై సీబీఐ విచారణ జరపాలని కోరినా పట్టించుకోవడం లేదు. ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి ‘ఆర్ఆర్ ట్యాక్స్’ వసూలు చేస్తున్నారని విమర్శించారు. హోంమంత్రి అమిత్ షా తెలంగాణ కాంగ్రెస్ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. కానీ, ఇప్పటివరకు ఆ ఆరోపణలపై ఎందుకు విచారణకు ఆదేశించలేదు? దీన్నిబట్టి కాంగ్రెస్, బీజేపీలు చీకటి దోస్తులని, ఒకరి అవినీతిని మరొకరు కాపాడుకుంటున్నారని స్పష్టమవుతోంది,” అని కేటీఆర్ విమర్శించారు.సింగరేణిలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి అరాచకాలకు పాల్పడుతున్నారని, ‘సైట్ విజిటేషన్ సర్టిఫికేట్’ అనే కొత్త విధానంతో కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల కుంభకోణంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్థానిక మంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన వారసత్వ ఉద్యోగాలపై విచారణ జరిపిస్తామని బెదిరించడం కాదని, సృజన్ రెడ్డి అవినీతిపై విచారణ జరిపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, అవినీతిని ఆపకపోతే ప్రతి బొగ్గు గనిపైనా అగ్గిపుట్టిస్తామని హెచ్చరించారు.క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 14 స్థానాలు గెలిచినా, మంత్రి వివేక్ ఓటమిని తట్టుకోలేక కౌన్సిలర్లను వేధించారని కేటీఆర్ మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని, పోలీసులతో భయానక వాతావరణం సృష్టించారని ఆరోపించారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగని తమ పార్టీ కౌన్సిలర్లను అభినందించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కేసీఆర్ చెప్పినట్లుగానే కాంగ్రెస్ పార్టీ అభయహస్తం పేరుతో తెలంగాణపై భస్మాసుర హస్తం పెట్టిందని కేటీఆర్ అన్నారు. సింగరేణి కార్మికుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని, రానున్న యూనియన్ ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# సంగారెడ్డిలో పేలుళ్లు..
## పలువురికి తీవ్ర గాయాలు

మొదటి పేజీ రువాయి

వారిని వెంటనే సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో ఇంట్లో మరికొన్ని గ్యాస్ సిలిండర్లు ఉన్నప్పటికీ అవి పేలకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే, ఇంట్లో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ జరుగుతోందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పుల్కల్‌లో అగ్ని ప్రమాదం..

కాగా, పుల్కల్ మండల కేంద్రంలో మరో ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో రెండు పూరి గుడిసెలు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రెండు కుటుంబాలు కట్టుబట్టలతో బయటపడటంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేలోపు గుడిసెలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి.

అప్రమత్తత అవసరం..

ఈ వరుస ఘటనలు గ్యాస్ సిలిండర్ల వినియోగంలో జాగ్రత్తల అవసరాన్ని మళ్లీ గుర్తుచేస్తున్నాయి. ముఖ్యంగా అక్రమ రీఫిల్లింగ్, భద్రతా నియమాలపై నిర్లక్ష్యం ఇలాంటి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రజలు గ్యాస్ సిలిండర్ల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.

గ్యాస్ డెలివరీ బాయ్ ఇంట్లో పేలుడు: రాజేశ్వర్

సంగారెడ్డిలో గ్యాస్ పేలుడు ఘటనపై సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి డీఎస్వో రాజేశ్వర్ మీడియాతో మాట్లాడారు. స్థానికంగా ఓ గ్యాస్ ఏజెన్సీలో డెలివరీగా బాయ్‌గా పనిచేస్తున్న సంగమేశ్వర్ ఇంట్లో సిలిండర్ పేలిందని తెలిపారు. గ్యాస్ లీకేజీ కారణంగానే పేలుడు సంభవించిందని అన్నారు. గ్యాస్ పేలుడు ధాటికి ఇంట్లో ఉన్న నలుగురుకి 10 శాతం నుంచి 15 శాతం గాయాలయ్యాయని చెప్పారు. గాయపడిన వారు కడియాల సంగమేశ్వర్, మలమ్మ, శ్రీజ, ఆమోస్‌గా గుర్తించినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన ఇంట్లో 7 కమర్షియల్, 8 డొమెస్టిక్ సిలిండర్లు నిల్వ ఉంచారని అన్నారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్లు ఎందుకు నిల్వ ఉంచారనే విషయంలో విచారణ జరుపుతున్నామని చెప్పారు. నివాస ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా భారీ సంఖ్యలో గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచారని ఇన్‌చార్జి డీఎస్వో రాజేశ్వర్ పేర్కొన్నారు.

## ఉనికి కోసం
# ఇరాన్ పోరాటం

మొదటి పేజీ రువాయి



ఇంటర్నెట్ డెస్క్: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరోసారి ఇరాన్‌పై మండిపడ్డారు. ఇరాన్ తన ఉనికిని కాపాడుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతోందని అన్నారు. ఆ దేశ మిసైల్ సామర్థ్యాలను ధ్వంసం చేశామని చెప్పారు. ఆ దేశ అణుకార్యక్రమాన్ని కూడా నామరూపాలు లేకుండా చేశామని చెప్పారు. దీంతో, ఊపిరాడక ఇరాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోందని అన్నారు.‘మా కార్యక్రమం ఇంకా ముగియలేదు. కానీ మేము అద్భుత విజయాలు సాధించామన్న విషయం ఇప్పటికే స్పష్టమైపోయింది. మమ్మల్ని చుట్టుముట్టి గొంతును బిగించాలని ఇరాన్ చూసింది. గాజాలో హమాస్, లెబనాన్‌లో హెజ్‌బొల్లా, సిరియాలో అసద్, ఇరాక్‌లో వివిధ మిలిటెంట్లు, యెమన్‌లో హౌతీలతో చుట్టుముట్టి ఊపిరాడకుండా చేయాలని చూసింది. నామరూపాలు లేకుండా చేయాలని అనుకుంది. ఇప్పుడు వారే తమ ఉనికి కోసం పోరాడుతున్నారు’ అని నెతన్యాహు పేర్కొన్నారు. యూఎస్-ఇరాన్ చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకుండానే ముగిసిన నేపథ్యంలో నెతన్యాహు వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.ఇరాన్‌తో చర్చలపై యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తాము సానుకూల ధోరణితోనే చర్చలకు వచ్చామన్నారు. సర్దుబాటు ధోరణిని కూడా ప్రదర్శించామని చెప్పారు. కానీ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోమని ఇరాన్ తమకు స్పష్టమైన హామీ ఇవ్వలేదని అన్నారు.అసమంజసమైన అమెరికా డిమాండ్ల కారణంగానే చర్చలు విఫలమయ్యాయని ఇరాన్ అధికారిక వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. తాము సూచించిన అనేక ప్రతిపాదనలను అమెరికా తిరస్కరించిందని పేర్కొంది. ఫలితంగా చర్చలు అర్ధాంతరంగా ముగిశాయని తెలిపింది.

# మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం


మొదటి పేజీ రువాయి


నిజామాబాద్: దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడమనేది చారిత్రక ఘట్టమని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. 2029 ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఇంత గొప్ప పండగ మరొకటి లేదని అరవింద్ పేర్కొన్నారు. ఈ బిల్లు ద్వారా చట్ట సభల్లో మహిళలకు ప్రాధాన్యం పెరుగుతుందన్నారు.మహిళా బిల్లుతో ఎస్సీ, ఎస్టీలకూ మంచి జరుగుతుందన్నారు. మహిళా రిజర్వేషన్లతో పారదర్శకత పెరిగి అవినీతి తగ్గుతుందని ఎంపీ అరవింద్ ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా బిల్లునూ రాజకీయం చేసేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఎంపీ అరవింద్ ఆగ్రహించారు. బీసీలను అనగదొక్కిందే కాంగ్రెస్ పార్టీ అంటూ విమర్శలు గుప్పించారు. ఆనాడు మండల్ కమిషన్‌ను వ్యతిరేకించిందీ వాళ్లేనని ఆరోపించారు. ఎంపీ లక్ష్మణ్‌తో తనకెలాంటి గ్యాప్ లేదన్నారు అరవింద్.తాను చిట్ చాట్ చేయనని.. అంతా ఓపెన్‌గా మాట్లాడతానని ధర్మపురి అరవింద్ చెప్పుకొచ్చారు. తెలంగాణ ఐకాన్ ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అంటూ ప్రశంసలు కురిపించారు. రాకేశ్ రెడ్డితోనూ తనకెలాంటి గ్యాప్ లేదని.. ఆయన సోదరుడితో సమానమని చెప్పుకొచ్చారు. తెలంగాణలో బీజేపీకి మెజారిటీ సీట్లు సాధించే రేసులో ముందుంటానని, అదే తన లక్ష్యమంటూ చెప్పుకొచ్చారు.



# పటాన్‌చెరులో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఘన సన్మాన సభ

మంత్రుల సమక్షంలో మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం






**పటాన్‌చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12 :**
వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనంగా ఏర్పాటైన సందర్భంగా, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు మార్కెట్ ప్రాంగణంలో ఘనంగా సన్మాన సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనరసింహ, తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి గారు, టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ , మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని, మార్కెట్ కమిటీ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి వారిని ఘనంగా సన్మానించారు. నూతనంగా ఏర్పాటైన మార్కెట్ కమిటీకి శివానందం చైర్మన్‌గా, రాజశేఖర్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా బిక్షపతి, మైపాల్, నాగరాజు, నర్సింలు, బాలరాజ్, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, సతీష్ కుమార్ గౌడ్, ఇమ్రాన్, సునీత, హమీద్, సామయ్య, మల్లయ్య, గోపాల్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బెంగాల్‌లో సిండికేట్ పాలనను అంతం చేస్తం.. అధికారంలోకి రాగానే యూసీసీ అమలు: ప్రధాని మోడీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, కోల్‌కతా:**
బెంగాల్‌ను మాఫియా, సిండికేట్లు శాసిస్తున్నాయని, రాష్ట్రాన్ని అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అరాచకానికి నిలయంగా మార్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సిండికేట్ పాలన(అధికార పార్టీ అండతో నడిచే మాఫియా తరహా వ్యవస్థ) లను అంతం చేస్తమని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ శనివారం దినాజ్‌పూర్ జిల్లా, ముర్షిదాబాద్ జిల్లాల్లో పర్యటించారు. కుష్మాండి, జంగీపూర్‌లలో నిర్వహించిన భారీ బహిరంగ సభల్లో మోదీ మాట్లాడుతూ.. 2026 అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్రంలో టీఎంసీ సృష్టించిన భయానికి, బీజేపీ ఇచ్చే నమ్మకానికి మధ్య జరుగుతున్న పోరాటమని అభివర్ణించారు. భయంపై నమ్మకం విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీఎంసీ హయాంలో మహిళలపై జరిగిన ప్రతి అకృత్యంపై విచారణ జరిపిస్తాం. ప్రతి అత్యాచార కేసు ఫైల్‌ను మళ్లీ తెరుస్తాం. దోషులను విడిచిపెట్టే ప్రసక్తే లేదు. ముఖ్యంగా ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఘటనపై బెంగాల్ ప్రజలంతా పార్టీలకు అతీతంగా ఏకమై పోరాడాలి. టీచర్ల నియామకంలో అవినీతికి పాల్పడినవారందరూ జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందే" అని హెచ్చరించారు. గతేడాది డిసెంబర్‌లో ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీ కోల్‌కతాకు వచ్చినప్పుడు కూడా మమత సర్కార్ సరైన భద్రతా ఏర్పాట్లు చేయలేదని ఆరోపించారు. ఈ ఆటను కూడా తన సిండికేట్లకు అప్పగించి భ్రష్టు పట్టించిందని విమర్శించారు. ఇక్కడ సిండికేటే ప్రభుత్వం.. ప్రభుత్వమే సిండికేట్ అని మోదీ మండిపడ్డారు.




**బెంగాల్‌లో యూసీసీ అమలు చేస్తం:**
రాష్ట్రంలో టీఎంసీ ప్రభుత్వం చేస్తున్న బుజ్జగింపు రాజకీయాలకు కాలం చెల్లిందని మోదీ తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రంలో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) అమలు చేస్తామని ప్రకటించారు. బెంగాలీలను మైనారిటీలుగా మారనివ్వబోమని స్పష్టం చేశారు. మతువా, నమశూద్ర సామాజిక వర్గాలకు పౌరసత్వం కల్పిస్తామని తెలిపారు. మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో చొరబాటుదారులను ఏరివేస్తామని స్పష్టం చేశారు. 'బెంగాల్‌పై 8 లక్షల కోట్ల అప్పు ఉంది. సిండికేట్రాజ్ వల్ల పరిశ్రమలు రాష్ట్రం వదిలి వెళ్తున్నాయి. దీనివల్ల యువత వలస బాట పడుతున్నది. గతంలో కమ్యూనిస్టుల పాలన నుంచి విముక్తి కోసం ప్రజలు టీఎంసీకి ఛాన్స్ ఇచ్చారు. కానీ ఆయుధాలు, డ్రగ్స్, పశువుల స్మగ్లింగ్.. ఇలా ప్రతి అక్రమ పనికి టీఎంసీ కాంట్రాక్టు తీసుకుంటున్నది. దేశమంతా రామ నవమి వేడుకలు ప్రశాంతంగా జరిగితే.. బెంగాల్‌లో మాత్రం ఊరేగింపులపై దాడులు జరుగుతున్నాయి. ఓటమి భయంతో టీఎంసీ నేతలు ఏఐ ద్వారా క్రియేట్ చేసిన ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారు. బెంగాల్ అభివృద్ధి చెందాలంటే 'డబుల్ ఇంజిన్' సర్కార్ రావాలి" అని మోదీ అన్నారు..

# కెర్చిపల్లి గ్రామంలో తెలంగాణ రైతాంగ పోరాట వీరుడు దొడ్డి కొమరయ్య విగ్రహ ఆవిష్కరణ

పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కురుమ సంఘం అధ్యక్షులు క్యామ మల్లేష్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం, కెర్చిపల్లి గ్రామంలో తెలంగాణ రైతాంగ పోరాట తొలి అమర వీరుడు దొడ్డి కొమరయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కురుమ సంఘం అధ్యక్షులు క్యామ మల్లేష్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... చిన్న వయసులోనే అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమరయ్య త్యాగం, ధైర్యం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. అలాగే, దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కురుమ సమాజ ప్రజలకు పిలుపునిస్తూ, సమాజ అభివృద్ధి కోసం ఐక్యంగా ఉండాలని, పరస్పరం అండగా నిలవాలని కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం నుండి కురుమ కులానికి చెందిన 10 మందికి పైగా నాయకులు పోటీ చేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అంతేకాకుండా, కెర్చిపల్లి గ్రామంలో కురుమ సంఘం భవనం నిర్మాణానికి



శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కురుమ సంఘం భవన నిర్మాణానికి రూ.1,00,000 ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మహిళల సామూహిక పారాయణం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో శనివారం రాత్రి జై శ్రీమన్నారాయణ బృందం భక్తిశ్రద్ధలతో సామూహిక పారాయణం చేశారు. లలిత సహస్ర పారాయణం, గోవింద నామాలు, హనుమాన్ చాలీసా సామూహికంగా పఠించారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పెంట రజిత, పుష్పలత, రంగ లక్ష్మి, చామకూర అరుణ, బెజుగం స్వప్న, నాల్ల పద్మ, బోగ లత, బిర్రు లక్ష్మి, రేపాక భాగ్యలక్ష్మి, ఉప్పల స్వప్న తదితరులు ఉన్నారు



# ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12 :**
బీరంగూడ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో గల శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డి పల్లి లో ఘనంగా శ్రీ హనుమాన్ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, సిద్దిపేట జిల్లా:**
సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం శ్రీ హనుమాన్ స్వామి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరి మాట్లాడుతూ గ్రామంలోని పురాతన హనుమాన్ ఆలయం పునర్నిర్మాణం, స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ, గత నాలుగు రోజులుగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు కన్నుల పండుగగా గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని, స్వామివారి కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలక వర్గం సభ్యులు, పురోహితులు రవీంద్ర శర్మ, గురుస్వామి అంజా గౌడ్, దాతలు, గ్రామస్థులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.


# తండ్రి కాదు.. వీడు 'మానవ మృగం'.. కన్న కూతురిపై అఘాయిత్యానికి పాల్పడ్డ రాక్షసుడు!



**హైదరాబాద్ పల్స్ న్యూస్ ఏప్రిల్ 12, మెయిన్ డెస్క్ :** రక్షణగా ఉండాల్సిన తండ్రే భక్షకుడిగా మారాడు. రక్త సంబంధాన్ని మరిచి, కనిపెంచిన కూతురిపైనే అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలంలోని ఒక గ్రామంలో చోటు చేసుకున్న ఈ అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. సదరు నిందితుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, కొంతకాలంగా తన పెద్ద కుమార్తెపై ఆ తండ్రి విచక్షణ కోల్పోయి అత్యాచారానికి పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో తండ్రి ప్రవర్తనపై అనుమానం వచ్చిన భార్య, అతడిని నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. తన కుమార్తెపై భర్తే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తెలుసుకున్న భార్య అతడితో తీవ్రంగా గొడవ పడింది. ఇంట్లో గొడవ పెద్దది కావడంతో, తన ఇద్దరు కుమార్తెల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారిని తీసుకుని తన పుట్టింటికి వెళ్లిపోయింది.

**కడుపునొప్పితో ఆసుపత్రికి వెళ్తే వెలుగులోకి..**
పుట్టింటికి వెళ్ళిన రెండు రోజుల తర్వాత బాధిత బాలికకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో బంధువులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించగా, బాలికపై జరిగిన అఘాయిత్యం బయటపడింది. దీంతో షాక్‌కు గురైన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మానవ మృగంలా ప్రవర్తించిన ఆ తండ్రిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ద్విచక్ర వాహన దారులందరూ హెల్మెట్ లేకుండా గ్రామంలోకి ప్రవేశం లేదు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** హెల్మెట్ లేకుండా మా గ్రామంలోకి ప్రవేశం లేదని రాజపేట మండలం పుట్టగూడెం గ్రామ పాలకులు చెబుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కచ్చితంగా పాటించాలని ఈ నిబంధన తీసుకువచ్చారు. పుట్టగూడెం గ్రామ ప్రజలకు ముఖ్య ప్రకటన గ్రామంలోకి ప్రవేశించే ద్విచక్ర వాహన దారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ లేకుండా గ్రామంలోకి ప్రవేశం నిషిద్ధం. మైనర్ బాలురు లేదా బాలికలు వాహనాలు నడిపితే, వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకోబడతాయి. ఇట్లు గ్రామ పంచాయతీ పాలకమండలి, పుట్టగూడెం అని బ్యానర్ ఏర్పాటు చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ గా మారినది.

# నాటి ఎస్ఎస్సి జిల్లా టాపర్ కు ఇంటర్ లోను ఉత్తమ మార్కులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన గొట్టిపాముల సాయి మేఘన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులు సాధించారు. ఆదివారం ఫలితాలు వెలువడిన తర్వాత సాయి మేఘన తల్లిదండ్రులు శ్రీలత శ్రీనివాసులు వివరాలు చెప్పారు. ఇంటర్ ఎంపీసి మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించారు. రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడంతో మేధా కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మి నిర్వాహకులు పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. రఘునాథపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన సాయి మేఘన గత ఏడాది యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయిలో ఎస్ఎస్సి పరీక్షల్లో 600 మార్కులకు గాను 582 మార్కులు సాధించి జిల్లా ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. అప్పటి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సైకిల్ బహుకరించి అభినందించారు. మేధా చారిటబుల్ ట్రస్ట్ వారు సాయి మేఘన ను ఉచితంగా ఇంటర్ చదివించేందుకు దత్తత తీసుకున్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని, మేధా చారిటబుల్ ట్రస్ట్ గౌరవాన్ని నిలుపుతూ ఇంటర్ మొదటి సంవత్సరంలో 466 మార్కులు సాధించడంతో పలువురు ఆమెను అభినందించారు.

# బేగంపేటలో సిపిఐ ఇంటింటి కార్యక్రమం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలో బేగంపేట గ్రామంలో సిపిఐ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐ పార్టీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం పాల్గొని ప్రసంగిస్తూ గంధమల్ల చెరువు నుండి బేగంపేట రోడ్ డ్యాం వరకు రౌండ్ చెక్ డ్యామ్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు అట్లాగే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను రెండో విడతలో సాంక్షన్ చేయాలని అట్లాగే అర్హులైన వారికి పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి మూలపోచయ ఏఐటీయూసీ తాపీ మేస్త్రిరి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జెల బాబు, పేట వెంకటయ్య సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఒడిశాలో పాక్ స్పై 'షేక్ ఇమ్రాన్' అరెస్ట్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, వెబ్ డెస్క్ :** పాకిస్తాన్ కు సమాచారం చేరవేస్తున్నాడనే ఆరోపణలతో జాతీయ భద్రతా దళాలు షేక్ ఇమ్రాన్ (22) అనే యువకుడిని భువనేశ్వర్‌లో అరెస్టు చేశారు. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్, ఒడిశా పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో, ఏప్రిల్ 10న భువనేశ్వర్‌లోని గంగానగర్ ప్రాంతంలో ఇతడిని అదుపులోకి తీసుకున్నారు. గత కొన్ని నెలలుగా ఒడిశా రాజధానిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న ఇమ్రాన్ పాక్ స్పైగా వ్యవహరిస్తున్నాడనే నిఘా వర్గాల సమాచారంతో అరెస్టు చేసి, భువనేశ్వర్ ఎస్‌డీజేఎం కోర్టులో హాజరుపరిచారు. అనంతరం నాలుగు రోజుల ట్రాన్సిట్ రిమాండ్‌పై ఢిల్లీకి తరలించారు.

బయటపడిందిలా...

ఢిల్లీలో ఇటీవల జరిగిన మరికొంతమంది ఉగ్ర నేపథ్యం ఉన్న యువకుల అరెస్టుల తర్వాత, వారి సోషల్ మీడియా డేటాను విశ్లేషించిన కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఇమ్రాన్ గురించి కీలక సమాచారం లభించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లైన ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వేదికగా ఇమ్రాన్ దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు, రాడికల్ గ్రూపులలో యాక్టివ్‌గా ఉంటూ భారత్‌కు వ్యతిరేకంగా కంటెంట్‌ను ప్రచారం చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా, ఇతడికి పాకిస్థాన్‌కు చెందిన అనుమానాస్పద వర్గాలతో లింకులు ఉండటం, దేశ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని వారికి చేరవేస్తున్నాడనేది ప్రధాన ఆరోపణ. ఇమ్రాన్ ప్రస్తుతం నిరుద్యోగిగా ఉంటూ, డిజిటల్ మాధ్యమాల ద్వారా తీవ్రవాద భావజాలాలను వ్యాప్తి చేస్తున్నాడని భావిస్తున్నారు.

**అత్యంత గోప్యత**

అరెస్టు చేసిన సమయంలో ఇమ్రాన్ వద్ద నుండి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు మరియు ఇతర డిజిటల్ పరికరాలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. భువనేశ్వర్-కటక్ కమిషనరేట్, ఢిల్లీ పోలీసుల మధ్య సమన్వయంతో ఈ కేసును అత్యంత గోప్యంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరికి సంబంధాలున్నాయనే అంశంపై విచారణ కొనసాగుతోంది. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున, భువనేశ్వర్ పోలీసులు అధికారికంగా ఎటువంటి విలేకర్ల సమావేశం నిర్వహించలేదు.

# హృదయ విదారక ఘటన.. సీమంతం రోజే గర్భిణీ స్త్రీ పై దాడి.. కవలలు మృతి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, హావేరి:** కర్ణాటకలో హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. హావేరి జిల్లాలోని సవనూర్ తాలూకాలోని అల్లిపుర గ్రామంలో గర్భిణి స్త్రీ కడుపులో మోస్తున్న కవల బిడ్డలను కోల్పోయింది. తీసుకున్న అప్పును తిరిగివ్వాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబంపై వడ్డీ వ్యాపారి, అతని కుటుంబం దాడి చేశారు. గర్భిణి అనే కనీస కనికరం లేకుండా ఆ తల్లి కడుపుపై తన్నడంతో నెలల నిండకుండానే పిల్లలకు జన్మనివ్వడంతో కవల పిల్లలు పుట్టిన కొన్ని గంటల్లోనే చనిపోయారు.వైద్యులు బాధితురాలి ప్రాణాన్ని కాపాడారు. ఆరు నెలల వయసున్న కవలలు మరణించడంతో ఈ ఘటన బాధిత కుటుంబంలో పెను విషాదం నింపింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. అల్లిపుర గ్రామానికి చెందిన హలవ్వ అనే మహిళ అదే గ్రామానికి చెందిన సురేష్ లమాని అనే వడ్డీ వ్యాపారి దగ్గర రూ. 30 వేలు అప్పుగా తీసుకుంది. ఆ తర్వాత ఊళ్లోకి తిరిగి రాలేదు.మార్చి 28న కూతురి సీమంతం కావడంతో ఊరికి తిరిగొచ్చింది. డబ్బులు తిరిగి ఇవ్వమని అడగడానికి వచ్చిన సురేష్, అతని కుటుంబ సభ్యులు గొడవ చేశారు. డబ్బులు ఇప్పటికిప్పుడు ఇవ్వాల్సిందేనని లొల్లి చేశారు. అయితే తీసుకున్న డబ్బులు కూతురి సీమంతం అయ్యాక వడ్డీతో సహా తిరిగిస్తానని.. కాస్త సమయం ఇవ్వాలని బాధిత మహిళ కోరింది. సదరు మహిళ వేడుకున్నా సురేష్, అతని కుటుంబం పట్టించుకోలేదు. హలవ్వపై దాడికి దిగారు. తల్లి హలవ్వపై దాడిని చూసిన ఆమె కూతురు.. ఆరు నెలల గర్భంతో ఉన్న పవిత్ర తల్లిపై దాడిని అడ్డుకోబోయింది.గర్భవతి అనే జాలి కూడా లేకుండా పవిత్ర కడుపుపై తన్ని దాడి చేయడంతో ఆమెకు తీవ్ర రక్తస్రావమైంది. పవిత్రను స్థానికులు హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి తరలించారు. పవిత్రను మార్చి 28న జిల్లా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా, ఏప్రిల్ 7న నెలలు నిండకముందే కవల పిల్లలకు జన్మనిచ్చింది. దురదృష్టవశాత్తూ పుట్టిన కొన్ని గంటల్లోనే ఇద్దరూ చనిపోయారు. ఈ దాడి ఘటనలో బాధిత కుటుంబం నలుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. సురేష్ లమాని, పరశురామ్ లమాని, మహేష్ లమాని, సక్కుబాయి లమాని అనే నలుగురిపై సవనూర్ పోలీస్ స్టేషన్‌లో బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను

# ప్రారంభించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

### రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది : ప్రభుత్వ విప్ ఐలయ్య






యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం, గోలనుకొండ, కొల్లూరు గ్రామం, మందనపల్లి, గ్రామాల్లో అదేవిధంగా ఆలేరు పట్టణంలోని మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగులు కేంద్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు బీర్ల ఐలయ్య ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని సరైన ధరకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి) ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరించే విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో తాగునీరు, తూకం యంత్రాలు, గన్నీ సంచులు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా, తేమ శాతం సరైన స్థాయిలో ఉంచి తీసుకురావాలని సూచించారు. ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరితగతిన జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీలో లైంగిక వేధింపులు, మతమార్పిడి కలకలం....

### ఇలాంటి మానవ మృగాలు ఉన్నచోట ఉద్యోగులు కాస్త భద్రం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, సెంట్రల్ బ్యూరో:** ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నాసిక్ కార్యాలయం తీవ్ర వివాదంలో చిక్కుకుంది. మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు, బలవంతపు మత మార్పిడికి పాల్పడుతున్నారన్న ఆరోపణలపై పలువురు ఉద్యోగులను తొలగించింది. ఈ ఏడాది మార్చిలో ముంబయి నాకా ప్రాంతంలోని ఓ బీపీఓ కార్యాలయంలో పని చేస్తున్న ఓ యువతి డియోలాలి క్యాంప్ పోలీసులను ఆశ్రయించింది. 2022-2026 మధ్య ఒక మహిళతో సహా ముగ్గురు సహోద్యోగులు తన మతపరమైన మనోభావాలు దెబ్బతీశారని ఆరోపించింది. ఓ పురుష సహోద్యోగి తనపై పలుమార్లు లైంగికంగా వేధించాడని తన ఫిర్యాదులో పేర్కొంది.

విచారణలో షాకింగ్ విషయాలు:

రంగంలోకి దిగిన నాసిక్ పోలీసులు ఏప్రిల్ 3 నాటికి మొత్తం తొమ్మిది ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు చేశారు. పోలీసుల విచారణ లోతుగా సాగేకొద్దీ మరిన్ని షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. నమోదైన ఎఫ్.ఐ.ఆర్ లలో 8 మంది మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులు, మత మార్పిడి ఒత్తిళ్లపై ఫిర్యాదు చేయగా, ఒక పురుష ఉద్యోగి కూడా మతపరమైన వేధింపులపై ఫిర్యాదు చేశారు. ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న పోలీసులు 'ప్రత్యేక విచారణ బృందం' ను ఏర్పాటు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు ఏడుగురిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో టీమ్ లీడర్లు, ఉన్నత స్థాయి ఉద్యోగులతో పాటు, ఫిర్యాదులను పట్టించుకోలేదన్న ఆరోపణలతో కంపెనీ మహిళా హెచ్ఆర్ మేనేజర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**జీరో టాలరెన్స్:**

ఈ ఘటనపై ఆదివారం టీసీఎస్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. మా సంస్థలో వేధింపులకు తావులేదు. ఉద్యోగుల భద్రతకు మేము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేసింది. నాసిక్ ఘటన మా దృష్టికి రాగానే తక్షణమే స్పందించామని విచారణ ఎదుర్కొంటున్న ఉద్యోగులందరినీ సస్పెండ్ చేసినట్లు తెలిపింది. పోలీసుల విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నాం అని కంపెనీ ప్రతినిధి తెలిపారు. అత్యంత పేరు ప్రఖ్యాతులు కలిగిన సంస్థలో ఇలా లైంగిక వేధింపులతో పాటు మతమార్పిడి వ్యవహారం ఇప్పుడు కలకలం రేపుతోంది.

# ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



హైదరాబాద్ పల్స్ న్యూస్ ఏప్రిల్ 12 ( నారాయణఖేడ్ ) నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ముందుగా నారాయణఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్ గ్రామంలో లబ్ధిదారులు బోయిని అనిత (భర్త కృష్ణమూర్తి), గైని సంగమ్మ (భర్త సంగయ్య), మరియు అనుసూజ (భర్త జ్ఞానేశ్వర్ రెడ్డి) నూతన గృహప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిరుపేదల సొంతింటి కల సాకారం కావడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం సిర్గాపూర్ మండల పరిధిలోని లక్ష్మణ్ నాయక్ తండాలో కొల గూని బాయి బాబు సింగ్ ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని నూతన వధూవరులకు, కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ్ రెడ్డి మాజీ సర్పంచ్, రమేష్ చౌహన్, పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ, హన్మంతు, నారాయణ రెడ్డి, ర్యాకల్ గ్రామం సర్పంచ్ జ్ఞానేశ్వర్, ఉప సర్పంచ్లు జైపాల్ యాదవ్, రామ్ రెడ్డి, నరసింహారెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, రామచందర్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్ తండా సర్పంచ్ విఠల్ నాయక్,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## లయన్ మనోజ్ దంపతులను సన్మానించిన వంగపల్లి అంజయ్య స్వామి

### 320 హెచ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా లయన్ మనోజ్ కుమార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి అన్నారు లయన్స్ క్లబ్ 320 హెచ్ డిస్టిక్ గవర్నర్ గా లయన్ మనోజ్ ఎన్నికైన సందర్భంగా వారిని మర్యాద పూర్వకంగా కలిసిన యాదగిరిగుట్ట ఆలేరు నియోజకవర్గం కాచారం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి, లయన్ మనోజ్ దంపతులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న లయన్ మనోజ్ 320 హెచ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ఎన్నిక కావడం అభినందనీయమని పదవికి వన్నెతెచ్చే విధంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ, వారు రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# బ్యూటీ పార్లర్ ని ప్రారంభించిన మాజీ జడ్పిటిసి శ్రీలత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీలో రాజాం లక్ష్మి నూతనంగా ఏర్పాటు చేసిన “లక్ష్మి” బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేసి, బ్యూటీ పార్లర్ ని ప్రారంభించిన బూర్గంపహాడ్ మాజీ జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ... మహిళలు తమ కుటుంబ బాధ్యతలు తెలుసుకొని తమ వంతు సహాయాన్ని అందిస్తూ తమకు నచ్చిన కలలో ప్రావీణ్యం సాధించి తమ ఆశలను నెరవేర్చుకుంటూ సమాజంలో తమకంటూ గుర్తింపు తెచ్చుకుంటూ మహిళలు పోటీ పడుతూ జీవిస్తున్నారు అన్నారు. అన్ని రంగాలలో మహిళలు ముందు ఉంటున్నారు అన్నారు, మన గ్రామ పంచాయతీలో మహిళలకు అందుబాటులో బ్యూటీ పార్లర్ ఉండడం మంచి విషయం అన్నారు, అలాగే పరిసర ప్రాంత మహిళలు, యువతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరుకున్నారు, ఒక మహిళగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తాను అన్నారు, ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ మండల మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, వారితో పాటు స్థానిక ఉప సర్పంచ్ యారం పున్నారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు యల్లంకి లలిత, సారపాక బిఆర్ఎస్ పార్టీ టౌన్ వైస్ ప్రెసిడెంట్ చట్టు ఆంజనేయులు, బెజ్జంకి కనకచారి, జి కృష్ణ, యు నాగేశ్వరావు, సావిత్రి, కొండపల్లి రాజేష్, కవిత, గొల్లపూడి ధనలక్ష్మి, రామకృష్ణ, గామలపాటి లక్ష్మణరావు, సీత, గామాలపాటి ప్రతి రమణ, నిమ్మకాయల అనంతలక్ష్మి, నకిరికంటి రమేష్, మంగ, గ్రామ పెద్దలు మహిళలు యువతులు, తదితరులు పాల్గొన్నారు.

## భర్త ఇంటి ముందు భార్య బైఠాయింపు ..

### - తనకు న్యాయం చేయాలని వివాహిత డిమాండ్ ... ?



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** బచ్చన్నపేట తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ భార్య, భర్త ఇంటి ముందు బైఠాయించిన ఘటన బచ్చన్నపేట మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం. ?రాజపేట మండలం జాల గ్రామానికి చెందిన కాకల్ల కనకయ్య, వెంకటమ్మల కుమార్తె సౌమ్యకు, నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కన్నె యాదయ్య, మల్లమ్మల రెండో కుమారుడు శివతో 2021లో ఘనంగా వివాహం జరిపారు. పెళ్లి సమయంలో పెద్దల సమక్షంలో సంప్రదాయబద్ధంగా రూ. 2.50 లక్షల నగదు, ఆరు తులాల బంగారం కట్న కానుకలుగా అందజేశారు. ?నాలుగేళ్లుగా వేధింపులు ?వివాహం జరిగిన మొదటి ఏడాది వీరి సంసారం సాఫీగానే సాగింది. అయితే, గత నాలుగు సంవత్సరాలుగా భర్త శివ తనను ఇంటికి తీసుకువెళ్లకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని సౌమ్య ఆవేదన వ్యక్తం చేశారు. భర్త మరియు బావ వైఖరితో విసిగిపోయిన బాధితురాలు, చివరకు న్యాయం కోసం భర్త ఇంటి ముందే మౌన పోరాటానికి దిగారు. ?నాకు న్యాయం జరిగే వరకు ఈ ఇంటి ముందు నుండి కదిలేది లేదు అని సౌమ్య స్పష్టం చేశారు. ఈ విషయమై ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అధికారులు స్పందించి తనకు తన భర్తతో కలిపి జీవించేలా న్యాయం చేయాలని ఆమె కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆమెకు మద్దతుగా జాల గ్రామస్తులు మరియు నాగిరెడ్డిపల్లి ప్రజలు భారీ సంఖ్యలో మద్దతు తెలిపారు.

# ఉప్పరగూడెం నుంచి రాష్ట్ర ర్యాంక్ దాకా - హాసిని ఘన విజయం



**హైదరాబాద్ పల్స్ ఏప్రిల్ 12, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన ఆకోజు శ్రీనివాస్ – అనిత దంపతుల కుమార్తె ఆకోజు హాసిని విద్యా రంగంలో అరుదైన ఘనత సాధించి తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటడం ద్వారా అందరి ప్రశంసలు అందుకుంది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలోనే స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించి ప్రత్యేక గుర్తింపు పొందిన హాసిని, అదే స్థాయిలో తన ప్రతిభను కొనసాగిస్తూ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 991 మార్కులు సాధించి మరోసారి అద్భుత ఫలితాన్ని నమోదు చేసింది. వరుస విజయాలతో ఆమె విద్యా ప్రస్థానం అందరికీ ఆదర్శంగా మారింది. సాధారణ కుటుంబానికి చెందిన హాసిని ఈ స్థాయి విజయాన్ని సాధించడం వెనుక ఆమె కృషి, పట్టుదల, క్రమశిక్షణ ప్రధాన కారణాలు. ఆమె సాధనతో ఉప్పరగూడెం గ్రామం, సిరోలు మండలం, మహబూబాబాద్ జిల్లా మాత్రమే కాకుండా మొత్తం తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తెచ్చింది. హాసిని విజయానికి ఆమె తల్లిదండ్రులు ఆకోజు శ్రీనివాస్ -- అనితల ప్రోత్సాహం కీలకంగా నిలిచింది. తమ కుమార్తె చదువుకు అండగా నిలిచి చేసిన త్యాగాలు ఈ విజయానికి బలమైన పునాదిగా మారాయి. గ్రామస్థులు ఈ కుటుంబాన్ని అభినందిస్తూ, “ఇలాంటి తల్లిదండ్రులే ఇలాంటి ప్రతిభావంతులను తయారు చేస్తారు కొనియాడుతున్నారు. హాసిని విజయంపై గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ, ఆమెకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశిస్తూ ఆశీర్వదించారు.గ్రామం నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగిన హాసిని విజయం యువతకు ఆదర్శం” అని పలువురు అభిప్రాయపడ్డారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యమైనా సాధ్యమే అని హాసిని మరోసారి నిరూపించింది.

## దుబ్బతండకు గర్వకారణం - ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన అజ్మీర సౌజన్య



**హైదరాబాద్ పల్స్ ఏప్రిల్ 12, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దుబ్బతండ గ్రామానికి చెందిన అజ్మీర సౌజన్య ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంది. మొత్తం 470 మార్కులకు గాను 403 మార్కులు సాధించి తన ప్రతిభను నిరూపించింది.
చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకున్న సౌజన్య, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ ఈ విజయాన్ని సాధించింది. నర్సరీ నుండి పదవ తరగతి వరకు డోర్నకల్‌లోని సెయింట్ ఆగ్నేష్ హై స్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసింది. పాఠశాల కరస్పాండెంట్ పసల ఆంథోనీ, ప్రిన్సిపాల్ హెలెన్ రాణి మార్గదర్శకత్వం ఆమెకు బలమైన పునాది అయ్యింది. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సింగరేణి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న సౌజన్య, తన తల్లిదండ్రుల ఆశలను నిలబెట్టిందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందించారు.

# వాగు దాటేదెలా... వరి కోత కోసేదెలా..?




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలోని చల్లూరు, బేగంపేట రైతులకు వరి కోతల సమయంలో కొత్త గుబులు మొదలైంది. గంధమల్ల చెరువు నుండి నీరు వదలడంతో బేగంపేట, చల్లూరు వాగు వెంట నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వాగు అవతల సుమారు 200 మంది రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం వెళుతుంటారు. పశువులకు మేత వేయడానికి పాలు పితకడానికి 20 రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. వరి కోతల ప్రారంభం కావడంతో రైతులకు కోత కోయడానికి హార్వెస్టర్లు, దాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించుకోవడానికి చాలా ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. పొట్టిమర్రి డైవర్షన్ రోడ్డు పైపులు కొట్టుకుపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని ఏ విధంగా మార్కెట్ యార్డ్ కు తీసుకువెళ్లాలో దిక్కుతోచని పరిస్థితి ఎదురైందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు వాగు వెంట వచ్చే నీటిని తాత్కాలికంగా 15 రోజులు నిలిపివేయగలరని కోరుతున్నారు. 20 రోజులైనా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలోమీటర్ దారి కోసం 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బేగంపేట – నర్సాపూర్ వాగు మీద, చల్లూరు – రేణికుంట వాగు మీద కల్వర్టులు నిర్మించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.




# బారెగుడ-ధరంపల్లి రహదారి దుస్థితి.....

### మిషన్ భగీరథ పైప్ లీకేజ్ తో బురదమయమైన రహదారి....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతనమానపల్లి మండలం మండలం బారెగుడ, ధరంపల్లి గ్రామాల మధ్య రహదారి దెబ్బతిని రాకపోకలు కష్టంగా మారాయి. మిషన్ భగీరథ పైప్ లీకేజీతో రోడ్లు బురదమయంగా మారడంతో 7వ వార్డులో జరుగుతున్న వివాహానికి వచ్చే బంధువులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు వాగు వద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రయాణం మరింత క్లిష్టమైంది. సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తూ తక్షణమే రహదారి మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## మల్లయకుంట తండా అభివృద్ధికి మార్గదర్శి...

# కార్యదర్శి కంసాని కళ్యాణ్‌కు ఘన వీడ్కోలు సన్మానం

### కార్యదర్శి కళ్యాణ్ సేవలను తండా వాసులు గుర్తు చేసుకున్నారు

**హైదరాబాద్ పల్స్ ఏప్రిల్ 12, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** డోర్నకల్ మండలం మల్లయకుంట తండా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లనున్న కంసాని కళ్యాణ్‌కు ఆదివారం అత్యంత ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభా అధ్యక్షులుగా బానోత్ శ్రీనివాస్ నాయక్, వ్యవహరించగా, తండా ప్రజలు, యువత, మహిళలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా తండా వాసులు మాట్లాడుతూ, కార్యదర్శి కళ్యాణ్ గత ఆరు సంవత్సరాలుగా మల్లయకుంట తండా అభివృద్ధిలో అందించిన సేవలు చిరస్మరణీయమని గుర్తు చేసుకున్నారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన చూపిన కృషి ప్రత్యేకమని తెలిపారు. ప్రత్యేకంగా గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు, శుభ్రత చర్యలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి తండా రూపురేఖలను మార్చారని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రతి సమస్యకు వెంటనే స్పందిస్తూ, గ్రామ అభివృద్ధిని తన బాధ్యతగా తీసుకుని ముందుకు నడిపించిన నాయకత్వం ఆయనదేనని ప్రశంసించారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో కళ్యాణ్ చేసిన సేవలు మరువలేనివని గ్రామస్థులు భావోద్వేగంతో గుర్తు చేసుకున్నారు.



ఆపద్భాందవుడిలా ప్రజలకు ధైర్యం చెప్పి, కరోనా సోకిన వారికి ఐసోలేషన్‌లో ఉండేలా పర్యవేక్షిస్తూ, అవసరమైన సహాయం అందిస్తూ ప్రతి ఇంటికి చేరువైన అధికారిగా నిలిచారని తెలిపారు. ఇలాంటి సేవా మనస్కుడైన కార్యదర్శి బదిలీపై వెళ్లడం తమకు తీరని లోటని పేర్కొంటూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలు నాయక్, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, సొసైటీ చైర్మన్ చెరెడ్డి బిక్షం రెడ్డి, మాజీ సర్పంచ్ ఫుల్ సింగ్ నాయక్, రాంబాబు నాయక్, లాలూ నాయక్, కపిల్, దూప్ సింగ్ నాయక్, జయరాం, నంద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో బ్రిలియంట్ హై స్కూల్ పూర్వ విద్యార్థుల వరుస విజయగాథ

### మూడు సంవత్సరాలుగా స్టేట్ ఫస్ట్ హ్యాట్రిక్




**హైదరాబాద్ పల్స్ ఏప్రిల్ 12, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** విద్యారంగంలో అద్భుత ప్రతిభను కనబరుస్తూ బ్రిలియంట్ హై స్కూల్ పూర్వ విద్యార్థులు మరోసారి తమ సత్తాను చాటుకున్నారు. 2024, 2025, 2026 సంవత్సరాల్లో వరుసగా మూడు సంవత్సరాలు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించడం ద్వారా ఈ పాఠశాల రాష్ట్రవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందింది. వరుస విజయాలతో డోర్నకల్ పట్టణంలో ఉన్న బ్రిలియంట్ హై స్కూల్ విద్యా ప్రమాణాలు ఎంత ఉన్నతంగా ఉన్నాయో మరోసారి స్పష్టమైంది. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి కాలా సిద్ధాంత్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడం విశేషంగా నిలిచింది. అత్యున్నత మార్కులు సాధించి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం ద్వారా తన కుటుంబానికి, పాఠశాలకు, డోర్నకల్ పట్టణానికి గర్వకారణంగా మారాడు. ఈ సందర్భంగా పట్టణంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. విద్యార్థి ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న బంధువులు, మిత్రులు, స్థానికులు అభినందనలు తెలియజేశారు. సిద్ధాంత్ జైన్ తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, తమ కుమారుడు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుకుంటూ ముందుకు సాగాడని తెలిపారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, పాఠశాల ఇచ్చిన బలమైన పునాది, క్రమబద్ధమైన చదువు విధానం ఈ విజయానికి కారణమని చెప్పారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని సిద్ధాంత్ నిరూపించాడని వారు గర్వంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ హై స్కూల్ కరస్పాండెంట్ వకంతుల అప్పారావు మాట్లాడుతూ, పాఠశాలలో అమలు చేస్తున్న నాణ్యమైన బోధన విధానం, విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, లక్ష్యసాధనపై దృష్టి పెట్టడం వల్లే ఇలాంటి అగ్ర ఫలితాలు సాధ్యమవుతున్నాయని అన్నారు. ప్రతి విద్యార్థిని వ్యక్తిగతంగా గమనిస్తూ, వారి బలహీనతలను అధిగమించేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, నిరంతర సాధనకు ప్రోత్సహించడం, పరీక్షలపై స్పష్టమైన అవగాహన కల్పించడం వంటి అంశాలు విజయానికి కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం కలిసి ఈ ఘన విజయాలకు దారితీస్తున్నాయని చెప్పారు. బ్రిలియంట్ హై స్కూల్ పూర్వ విద్యార్థులు వరుసగా మూడు సంవత్సరాలు స్టేట్ ఫస్ట్ సాధించడం సాధారణ విషయం



కాదని, ఇది పాఠశాల యొక్క విద్యా నాణ్యతకు ప్రతీకగా నిలుస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ విజయంతో పాఠశాల పేరు రాష్ట్రవ్యాప్తంగా మరింత ప్రతిష్ట పెంచుకుంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు కొనసాగాలని, మరింత మంది విద్యార్థులు అగ్రస్థానాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్ష వ్యక్తం చేసింది. ఈ ఫలితాలు ఇతర విద్యార్థులకు కూడా ప్రేరణగా నిలుస్తాయని స్థానికులు పేర్కొన్నారు.

# రెబ్బెన మండలంలో పోటీ పరీక్షల గ్రంథాలయం ప్రారంభం.....




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్‌ను పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం గ్రంథాలయంగా రూపాంతరం రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. పాత పోలీస్ స్టేషన్‌ను ఆధునిక సదుపాయాలతో గ్రంథాలయంగా అభివృద్ధి చేసి, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత కోసం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు మెరుగైన చదువు వాతావరణం కల్పించడం, పోటీ పరీక్షల్లో విజయాన్ని సాధించేందుకు అవసరమైన వనరులు అందించడం లక్ష్యంగా ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, సాధన మెటీరియల్, ప్రస్తుత వ్యవహారాల పుస్తకాలు, మరియు వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే గ్రంథాలు అందుబాటులో ఉంచినట్లు



తెలిపారు. ప్రశాంతమైన చదువు వాతావరణంతో పాటు, యువతకు ఉపయుక్తమైన అన్ని సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, ఆసిఫాబాద్ ఎఎస్పీ చిత్తరంజన్ మరియు రెబ్బెన సీఐ సంజయ్, ఎస్ ఐ వెంకటకృష్ణ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## కాళ్లలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..? అయితే అది క్యాన్సర్ కావచ్చు, జాగ్రత్త..



సాధారణంగా కాళ్లల్లో వచ్చే సమస్యలు కండరాల ఒత్తిడిని, వెరికోస వెయిన్స్ లేదా పోషకాహార లోపాన్ని సూచిస్తూ ఉంటాయి. అయితే కాళ్లల్లో నిరంతరం ఉండే ఈ లక్షణాలు క్యాన్సర్ ముందస్తు హెచ్చరిక సంకేతాలు అని మీకు తెలుసా. లింఫోమా, ఎముక క్యాన్సర్, మృదు కణజాల సార్కోమా , లుకేమియా, ప్రోస్టేట్ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, వెన్నెముకకు వ్యాపించే క్యాన్సర్లు వంటి కొన్ని రకాల క్యాన్సర్లు నరాల మీద ఒత్తిడి, రక్త ప్రవాహాన్ని అడ్డుకోవడం, ఎముక ప్రమేయం కారణంగా కాళ్లల్లో మార్పులు వస్తాయి. ఈ లక్షణాలు నెమ్మదిగా అభివృద్ధి చెందుతాయి. కనుక చాలా మంది వీటిని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ కాళ్లల్లో కనిపించే ఈ లక్షణాలను గుర్తించి తక్షణ వైద్య సహాయం తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. కాళ్ళల్లో కనిపించే క్యాన్సర్ హెచ్చరిక సంకేతాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. రెండు కాళ్లల్లో వాపు రావడంతో పాటు ఈ వాపు రోజుల తరబడి ఉండడం వంటి లక్షణాలు లింఫోమా, అండాశయ క్యాన్సర్ లేదా కటి కణతులు వంటి క్యాన్సర్లను సూచిస్తాయి. క్యాన్సర్ కణాల ద్వారా శోషరస గ్రంథులు నిరోధించబడినప్పుడు ద్రవం పేరుకుపోతుంది. దీంతో ఇది లింఫెడిమా లాంటి వాపుకు దారితీస్తుంది. అలాగే నిరంతరం నొప్పి, పదునైన నొప్పి లేదా రాత్రి సమయంలో తీవ్రంగా ఉండే ఈ నొప్పి ఎముక క్యాన్సర్ లేదా కాళ్ల ఎముకలను ప్రభావితం చేసే మెటాస్టాటిక్ క్యాన్సర్ ను సూచిస్తుంది. వ్యాయామం చేసే సమయంలో, బరువులు ఎత్తే సమయంలో ఈ నొప్పి మరింత తీవ్రమవుతుంది. సాధారణ నివారణ పద్ధతులకు నొప్పి తగ్గకపోయిన లేదా వారాల పాటు ఇలాగే నొప్పి కొనసాగినా వైద్యుడిని సంప్రదించడం మంచిది. వెన్నెముక, కటి లేదా ఉదర ప్రాంతాన్ని ప్రభావితం చేసే క్యాన్సర్లు కాళ్ళను నియంత్రించే నరాలను కుదించగలవు. ఇది కాళ్లు లాగడం, ఆకస్మికంగా కాళ్లు బలహీనంగా అవ్వడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు తగ్గడానికి బదులుగా కాలక్రమేణా మరింత ఎక్కువవుతూ ఉంటాయి. మృదు కణజాల సార్కోమాలు సాధారణంగా తొడ, పిరుదుల్లో నొప్పి లేకుండా గడ్డలు ప్రారంభమవుతాయి. ఈ గడ్డలు గట్టిగా అనిపిస్తాయి. కాలక్రమేణా వాటి పరిమాణం పెరుగుతుంది. నొప్పి కూడా ఎక్కువవుతుంది. వేగంగా పెరిగే గడ్డలను గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. కాళ్లపై మెలనోమా, పొలుసుల క్యాన్సర్, బేసల్ కణ క్యాన్సర్ సంకేతాలు కూడా కనిపిస్తాయి. ఆకారం మారే పుట్టు మచ్చలు, కొత్త పెరుగుదలలు లేదా వారాల పాటు నయం కాని గాయాలు క్యాన్సర్ లక్షణాల్లో ఒకటని చెప్పవచ్చు. కణతులు రక్తనాళాలు లేదా శోషరస నాళాలపై నొక్కుతున్నప్పుడు రక్తప్రసరణ తగ్గుతుంది. దీని వల్ల తీవ్రమైన తిమ్మిర్లు, కాళ్లు బరువుగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు కదలికతో మరింత తీవ్రమవుతాయి. విశ్రాంతి తీసుకున్న తరువాత మెరుగుపడతాయి. కాళ్లల్లో ఈ లక్షణాలు కనిపించడంతో పాటు బరువు తగ్గడం, రాత్రి చెమటలు అధికంగా ఉండడం, ఆకలి లేకపోవడం, తక్కువ స్థాయి జ్వరం వంటి లక్షణాలను కూడా క్యాన్సర్ లక్షణాలుగా చెప్పవచ్చు. ఇక ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించి సరైన కారణాన్ని తెలుసుకోవడం చాలా ముఖ్యం. కాళ్లల్లో ఇటువంటి లక్షణాలు కనిపించిన వారు ఆహారంలో మార్పులు చేసుకోవడం కూడా చాలా ముఖ్యం. బెర్రీలు, ద్రాక్ష, ఆకుకూరలు, బ్రోకలీ, పాలకూర, టమాటాలు, గింజలు, విత్తనాలు వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. అలాగే అలసట తగ్గడానికి ఐరన్ ఎక్కువగా ఉండే కాయధాన్యాలు, బీన్స్, గుమ్మడి గింజలు, చేపలు, లీన్ మాంసం వంటి వాటిని తీసుకోవాలి. ఎముకల నొప్పి తగ్గడానికి క్యాల్షియం ఎక్కువగా ఉండే పాలు, నువ్వులు, విటమిన్ డి, తృణ ధాన్యాలు, బాదం, అంజీర్ వంటి ఆహారాలను తీసుకోవాలి. నీటిని ఎక్కువగా తాగాలి. కాళ్లల్లో ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఆందోళన చెందకుండా ముందుగా వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవడంతో పాటు ఆహారంలో మార్పులు చేసుకోవడం వల్ల సమస్య నుండి సులభంగా బయటపడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

## సిర్పూర్ రైతులకు అండగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్....

# పోడు భూముల సమస్య కోసం బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వద్దకు రైతులు....

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 12, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, సిర్పూర్ మండలం సిర్పూర్ మండలం ఆరెగూడ, పెద్దబండ గ్రామాల పేద రైతులు తమ పోడు భూముల సమస్య పరిష్కారం కోసం నిరీక్షిస్తున్న నేపథ్యంలో, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అటవీ అధికారులతో నేరుగా చర్చలు జరిపారు. అమాయక రైతులకు తక్షణం న్యాయం చేయాలని, సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. రైతులపై ఏదైనా చర్య తీసుకుంటే తాను వ్యక్తిగతంగా బాధ్యత వహిస్తానని స్పష్టంగా చెప్పారు.

**పోడు భూముల సమస్య ఏమిటి?**

పోడు సేద్యం అంటే అటవీ ప్రాంతంలో లేదా దాని సరిహద్దుల్లో చేసే వ్యవసాయం. తెలంగాణలో కొమురం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, గిరిజన జిల్లాల్లో – వేల కుటుంబాలు తరతరాలుగా పోడు సేద్యంపైనే జీవనం సాగిస్తున్నాయి. సిర్పూర్ టీ మండలం పరిధిలోని ఆరెగూడ సహా పలు గ్రామాల్లో వేలాది ఎకరాల అటవీ భూములు వివాదంలో ఉన్నాయి. అయితే చాలా మంది రైతులకు ఇప్పటివరకూ చట్టబద్ధమైన పట్టాలు లభించలేదు. దీంతో అటవీ అధికారులు చర్యలు తీసుకుంటారన్న భయంతో రైతులు నిరంతరం అభద్రతలో బతుకుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రమవుతోంది.

ఈ సమస్య కేవలం సిర్పూర్‌కే పరిమితం కాదు. తమ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, అటవీ అధికారుల వేధింపుల నుండి రక్షించాలని కోరుతూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దిందా గ్రామం నుంచి హైదరాబాద్‌కు 400 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసనకు దారితీసింది.

**ప్రభుత్వ చర్యలు ఏమిటి?**

అటవీ హక్కుల చట్టం (2006) కింద ఇప్పటివరకు 2.30 లక్షల మంది రైతులకు 6.69 లక్షల ఎకరాల పోడు భూమి పంపిణీ పూర్తయింది. అయినప్పటికీ పలు కారణాలతో వేలాది దరఖాస్తులు ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయి. అంతేకాదు, పోడు భూముల్లో సేద్యం చేసే రైతులందరికీ 2025–2030 మధ్య సోలార్ పంపుసెట్ల ద్వారా నీటివసతి కల్పించాలని "ఇందిర సౌర గిరి జల వికాసం" పేరిట రాష్ట్ర ప్రభుత్వం పథకం రూపొందించింది. ఆరెగూడ, పెద్దబండ రైతుల ప్రస్తుత స్థితి పట్టాలు లేకపోవడం వల్ల సిర్పూర్ మండలం రైతులు రుణాలు పొందలేకపోతున్నారు. పంట నష్టపరిహారానికి అర్హత కోల్పోతున్నారు. అటవీ అధికారులు ఎప్పుడు చర్యలు తీసుకుంటారోనన్న




ఆందోళనతో ఏళ్ల తరబడి కష్టపడి సాగు చేసిన పంటలు కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రవీణ్ కుమార్ జోక్యం చేసుకుని అటవీ అధికారులతో నేరుగా చర్చలు జరపడం గ్రామస్థులకు ఊరటనిచ్చింది.

# పుష్-అప్స్ చేయడం ప్రారంభించే వారికి ఈ 8 సూచనలు ఎంతో ఉపయోగపడతాయి..

పుష్-అప్స్ అనేవి శరీర బరువుతో చేసే అత్యంత ప్రభావవంతమైన వ్యాయామాలలో ఒకటి. ఇవి ఒకేసారి ఛాతీ, భుజాలు, చేతులు, కోర్ వంటి అనేక కండరాలను లక్ష్యంగా చేసుకుంటాయి. అయితే ఒకే సెట్లో ఎక్కువ సంఖ్యలో పుష్-అప్స్ చేయడం చాలా మందికి కష్టంగా ఉంటుంది. 2005లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం శరీరాన్ని తల నుంచి పాదాల వరకు నిటారుగా ఉంచడం, కోర్‌ను యాక్టివ్‌గా ఉంచడం ఎంతో ముఖ్యమని సూచించింది. చేతుల స్థానం, శరీర సరళిలో చిన్న మార్పులు కూడా ఏ కండరాలు పనిచేస్తున్నాయో గణనీయంగా ప్రభావితం చేస్తాయని పరిశోధనలు నిర్ధారించాయి. సరైన టెక్నిక్, శిక్షణ పద్ధతులను అనుసరిస్తే పుష్-అప్స్ పనితీరును క్రమంగా మెరుగుపరచడం సాధ్యమవుతుంది. రోజువారీ పుష్-అప్స్ సంఖ్యను పెంచేందుకు 8 ఉపయోగకరమైన సూచనలు ఇలా ఉన్నాయి.

**ఇన్‌క్లైన్ పుష్-అప్స్ తో అధిక శక్తి..**

పుష్-అప్స్ చేసేటప్పుడు సరైన ఫామ్‌పై దృష్టి పెట్టాలి. పుష్-అప్ చేస్తూ శరీరాన్ని తల నుంచి మడమల వరకు ఒక సరళ రేఖలో ఉంచాలి. చేతులను భుజాల వెడల్పు కంటే కొంచెం వెడల్పుగా ఉంచాలి. మొత్తం కదలికలో కోర్‌ను బిగుతుగా ఉంచడం అవసరం. సరైన ఫామ్ వల్ల సరైన కండరాలు పనిచేస్తాయి, గాయాల ప్రమాదం తగ్గుతుంది. స్టాండర్డ్ పుష్-అప్స్ కష్టంగా అనిపిస్తే సులభమైన మార్పులతో ప్రారంభించడం మంచిది. మోకాలిపై చేసే పుష్-అప్స్ లేదా గోడ లేదా బెంచ్‌పై చేయబడే ఇన్‌క్లైన్ పుష్-అప్స్ ద్వారా క్రమంగా శక్తిని పెంచుకోవచ్చు. ఈ మార్పులు ప్రారంభ స్థాయి వ్యక్తులకు సరైన టెక్నిక్‌ను కాపాడుకుంటూ శక్తిని పెంపొందించడానికి సహాయపడతాయి. ఇన్‌క్లైన్ లేదా నీ (మోకాలి) పుష్-అప్స్ ప్రారంభించడం కేవలం సులభతరం కోసం మాత్రమే కాదు, గ్రౌండ్ రియాక్షన్ ఫోర్స్‌ను నియంత్రించేందుకు శాస్త్రీయంగా సరైన విధానంగా కూడా పరిగణిస్తారు.

**సంఖ్యను క్రమంగా పెంచాలి..**

పుష్-అప్స్ సంఖ్యను పెంచేటప్పుడు క్రమంగా పెంచడం కీలకం. ఒక్కసారిగా ఎక్కువ చేయడానికి ప్రయత్నించకుండా రోజుకు లేదా వారానికి ఒకటి లేదా రెండు చొప్పున పెంచడం మంచిది. ఈ విధానం కండరాలు ఒత్తిడికి అలవాటు పడేలా చేస్తుంది. పుష్-అప్స్ చేయడంలో ఉపయోగపడే సహాయక కండరాలను బలపరచడం కూడా ముఖ్యమే. ఛాతీ, భుజాలు, ట్రైసెప్స్ వంటి కండరాలను ఇతర వ్యాయామాల ద్వారా బలపరిస్తే పనితీరు మెరుగవుతుంది. ప్లాంక్, ట్రైసెప్స్ డిప్స్ వంటి వ్యాయామాలు శరీర స్థిరత్వం, చేతుల బలం పెంచడంలో సహాయపడతాయి. నిరంతర సాధన విజయానికి కీలకం. తరచుగా పుష్-అప్స్ ప్రాక్టీస్ చేయడం వల్ల కండరాలు, నాడీ వ్యవస్థ ఈ వ్యాయామాన్ని సమర్థవంతంగా చేయడానికి అలవాటు పడతాయి. రోజూ కొద్దిసేపు చేసినా కాలక్రమంలో మంచి ఫలితాలు కనిపిస్తాయి.




**చిన్న చిన్న సెట్స్‌లో చేయాలి..**

ఒకేసారి పెద్ద సెట్స్ చేయడం కంటే చిన్న చిన్న సెట్స్‌గా విభజించడం మంచిది. ఉదాహరణకు ఐదు పుష్-అప్స్ చేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని మళ్లీ చేయడం ద్వారా మొత్తం సంఖ్యను పెంచుకోవచ్చు. ఈ విధానం స్టామినా పెంచడంలో సహాయపడుతుంది. కోర్ బలం కూడా ఎంతో కీలకం. కోర్ బలహీనంగా ఉంటే శరీరం వంగిపోవడం లేదా వెన్నెముక వంకరగా మారడం వల్ల వ్యాయామం కష్టమవుతుంది. మౌంటెన్ క్లైంబర్స్ వంటి వ్యాయామాలు కోర్ బలాన్ని పెంచి పుష్-అప్స్ సులభంగా చేయడంలో సహాయపడతాయి. శరీరానికి సరైన విశ్రాంతి, పోషకాహారం కూడా అవసరం. కండరాలు విశ్రాంతి సమయంలోనే బలపడతాయి. సరిపడ నిద్ర, తగినంత నీరు, ప్రోటీన్ తీసుకోవడం ద్వారా కండరాల పునరుద్ధరణ మెరుగవుతుంది. విశ్రాంతి లేకుండా అధికంగా శిక్షణ తీసుకుంటే అలసట లేదా గాయాలు సంభవించే అవకాశం ఉంటుంది.పుష్-అప్స్ పైభాగ శక్తిని, స్టామినాను పెంచే శక్తివంతమైన వ్యాయామం. సరైన ఫామ్, సహాయక కండరాల బలం, క్రమమైన పురోగతి ద్వారా రోజువారీ పుష్-అప్స్ సంఖ్యను స్థిరంగా పెంచుకోవచ్చు. నిరంతర సాధన, ఓర్పుతో చిన్న మార్పులు కూడా దీర్ఘకాలంలో పెద్ద ఫలితాలను ఇస్తాయి

# చియా.. వీరికి వద్దయా!

చియా గింజలు అనేక పోషకాలతో నిండి ఉంటాయి. బరువు తగ్గడానికి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో ముందుంటాయి. దాంతో ఇప్పుడు చాలామంది వీటిని తమ రెగ్యులర్ డైట్‌లో భాగం చేసుకుంటున్నారు. అయితే, కొన్ని ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు చియా సీడ్స్ తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక రక్తపోటుతో బాధపడేవారికి చియా సీడ్స్ దివ్యౌషధమే! ఎందుకంటే, రక్తపోటు స్థాయుల్ని తగ్గించడంలో ఇవి ముందుంటాయి. కాబట్టి, లోబీపీతో బాధపడేవారికి ఇవి హాని కలిగిస్తాయి. వీటిని తీసుకుంటే బీపీ మరింత పడిపోయే ప్రమాదం ఉంటుంది.



డయాబెటిస్‌కు మందులు వాడుతున్నవారు కూడా చియా సీడ్స్ ఎక్కువగా తీసుకోవద్దు. ఇవి రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. డయాబెటిస్ రోగులు ఇన్సులిన్, ఇతర మందులు వాడుతుంటే.. చియా విత్తనాలు రక్తంలోని షుగర్ లెవల్స్‌ను మరింతగా తగ్గిస్తాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండటమే మంచిది.

రక్తాన్ని పలుచబరిచే మందులు వాడుతున్నవారు.. చియా విత్తనాలను పక్కన పెట్టేయాలి. ఎందుకంటే.. ఇందులో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్..

రక్తం గడ్డకట్టకుండా చేసే గుణాన్ని కలిగి ఉంటాయి. కాబట్టి, వీటిని తీసుకుంటే.. రక్తం మరింతగా పలుచబడుతుంది.

మూత్రపిండాల్లో రాళ్లు, ఇతర కిడ్నీ సమస్యలు ఉన్నా.. చియా విత్తనాల్ని తినకూడదు. వీటిలో పొటాషియం, ఆక్సలేట్లు, ఫాస్ఫేట్లు ఉంటాయి. ఇవి మూత్రపిండాల్లో రాళ్ల సమస్యలను మరింత తీవ్రతరం చేస్తాయి.

ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ లాంటి జీర్ణ సమస్యలతో బాధపడేవారికీ చియా గింజలు హాని కలిగించే ప్రమాదం ఉంటుంది.

కొందరిలో చియా గింజలు అలర్జీ కలిగిస్తాయి. ఫలితంగా, చర్మంపై దద్దుర్లు, వాపు, దురద, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది రావొచ్చు. అలాంటివారు కూడా చియా సీడ్స్ తీసుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

చిన్నపిల్లలు, గర్భిణులు, పాలిచ్చే మహిళలు కూడా.. వైద్యులను సంప్రదించిన తర్వాతే చియా విత్తనాల్ని తీసుకోవాలి.

# మెదడుకు ఇవ్వండి విశ్రాంతి

డోపమైన్.. మన మెదడులో విడుదలయ్యే ఒక న్యూరోట్రాన్స్‌మీటర్. దీనిని సాధారణంగా ఫీల్ గుడ్ హార్మోన్ అని పిలుస్తారు. మనం ఏదైనా కొత్త విషయాన్ని చూసినప్పుడు, రుచికరమైన ఆహారం తిన్నప్పుడు లేదా ప్రశంసలు పొందినప్పుడు మెదడులో డోపమైన్ విడుదలై మనకు ఆనందాన్ని, ఉత్తేజాన్ని ఇస్తుంది. ఒకప్పుడు నచ్చిన మనిషిని చూసినప్పుడు, మనసు మెచ్చిన విషయాలు జరిగినప్పుడు ఇలా జరిగేది. కానీ, ఈ డిజిటల్ యుగంలో.. మన డోపమైన్‌ని ఫోన్ ప్రభావితం చేస్తుండటం గమనార్హం.ఫోన్ రింగ్ అయినా, వైబ్రేట్ అయినా 'ఏదో కొత్త విషయం వచ్చింది' అనే కుతూహలం చెలరేగడం కారణంగా మెదడులో డోపమైన్ విడుదలవుతున్నది. మనం పెట్టిన పోస్ట్‌కు లైక్ లేదా కామెంట్ రాగానే, అది ఒక రివార్డులా అనిపించి తక్షణ ఆనందం పొందుతున్నారు. రీల్స్ లేదా షార్ట్స్ స్క్రోల్ చేస్తున్నప్పుడు, ప్రతి సెకనుకు ఒక కొత్త విషయం కనిపిస్తూ మెదడుకు నిరంతరం డోపమైన్ హిట్స్ అందిస్తుంది.క్రమంగా, మెదడు ఈ స్థాయి ఆనందానికి అలవాటు పడిపోతుంది. దీనివల్ల సాధారణ విషయాల్లో (చదువు, పని, సంభాషణలు) ఆనందం కలగదు. నిరంతర డోపమైన్ హిట్స్ వల్ల కొన్ని మానసిక ఇబ్బందులు తలెత్తే అవకాశాలు లేకపోలేదు. వాటిలో.. మెదడు ఎప్పుడూ కొత్త ప్రేరణ కోసం వెతుకుతూ ఉండటం వల్ల ఒక విషయంపై దృష్టి పెట్టలేం. డోపమైన్, ఫోన్ నుంచి వచ్చే బ్లూ లైట్ మెదడును అప్రమత్తంగా ఉంచి నిద్రను దూరం చేస్తాయి. దాంతో మెదడు నిరంతరం సమాచారాన్ని ప్రాసెస్ చేయడం వల్ల త్వరగా అలసిపోతుంది. ఇది ఒక మానసిక సంఘర్షణకు దారితీస్తుంది. మనం ఒక పుస్తకం చదువుతున్నప్పుడు, ఒక ముఖ్యమైన పని చేస్తున్నప్పుడు మెదడు నిలకడగా తకువ స్థాయిలో డోపమైన్‌ను విడుదల చేస్తుంది.స్మార్ట్ ఫోన్ వాడినప్పుడు మాత్రం ప్రతి సెకనుకు ఒక కొత్త నోటిఫికేషన్ లేదా వీడియో ద్వారా ఇన్‌స్టంట్ డోపమైన్ హిట్స్ లభిస్తాయి. ఇలా వేగవంతమైన ఆనందానికి అలవాటు పడిన మన మెదడు కాలక్రమంలో ఏకాగ్రతను కోల్పోతుంది. ఫోన్ పకన ఉన్నప్పుడూ తరచూ 'ఏదైనా మెసేజ్ వచ్చిందేమో' అని దాని వంకే చూస్తుంటాం. దీన్నే ప్రోయాక్టివ్ చెకింగ్ అంటారు. ప్రతిసారీ మనం పనిని ఆపి ఫోన్ చూడటం వల్ల మన ఏకాగ్రత ముకలైపోతుంది.ఒకసారి ఏకాగ్రత చెదిరితే, తిరిగి పూర్తిస్థాయిలో పనిపై దృష్టి పెట్టడానికి సగటున 23 నిమిషాలు పడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పూర్వం ఖాళీగా ఉన్నప్పుడు ఇతర విషయాలు ఆలోచించేవాళ్లం లేదా ప్రకృతిని గమనించేవాళ్లం. కానీ, ఇప్పుడు ఒక నిమిషం బోర్ కొట్టినా వెంటనే ఫోన్ అందుకుంటున్నాం. దీనివల్ల మెదడుకు విశ్రాంతి లేకుండా పోతున్నది. ఏకాగ్రత పెరగడానికి మెదడుకు కొంత ఖాళీ సమయం అవసరం, కానీ డోపమైన్ హిట్స్ ఆ అవకాశాన్ని ఇవ్వడంలేదు.

**పరిష్కారం మీ చేతుల్లోనే**

మోనో-టాసింగ్: ఒకే సమయంలో ఒకే పని చేయడం అలవాటు చేసుకోవాలి. ఫోన్ చూస్తూ చదవడం లేదా తింటూ పని చేయడం మానుకోవాలి.

డోపమైన్ డిటాక్స్: రోజులో కనీసం 1-2 గంటలు ఎటువంటి డిజిటల్ పరికరాలు లేకుండా గడపాలి. ఇది మెదడులోని డోపమైన్ గ్రాహకాలను తిరిగి సాధారణ స్థితికి తెస్తుంది.


డీప్ వర్: ఫోన్‌ను పక గదిలో ఉంచి, కనీసం 45 నిమిషాల పాటు పూర్తి ఏకాగ్రతతో పని చేయడం ప్రాక్టీస్ చేయాలి.

స్టాప్ నోటిఫికేషన్లు: అనవసరమైన యాప్స్ నోటిఫికేషన్లు ఆఫ్ చేయడం వల్ల కాస్త ఉపశమనం పొందవచ్చు.

గ్రే సేల్ మోడ్: ఫోన్ స్క్రీన్‌ను బ్లాక్ అండ్ వైట్‌లోకి మార్చడం వల్ల మెదడుకు కలిగే ఆకర్షణ తగ్గుతుంది.

డెడ్ జోన్స్: భోజనం చేసేటప్పుడు, పడుకునే ముందు ఫోన్‌ను దూరంగా ఉంచడం అలవాటు చేసుకోవాలి.

ప్రత్యామ్నాయాలు: డోపమైన్ కోసం ఫోన్ కాకుండా వ్యాయామం, పుస్తక పఠనం లేదా తోటపని వంటి సహజమైన పనులను ఎంచుకోవాలి.



# చిన్నపిల్లల్లో జుట్టు తెల్లబడటానికి కారణాలు ఇవే




ఇంటర్నెట్ డెస్క్: ఈ రోజుల్లో చిన్నపిల్లల్లో కూడా జుట్టు తెల్లబడటం ఎక్కువగా కనిపిస్తోంది. ఇది తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగించే విషయం. చాలా మంది దీనిని చిన్న సమస్యగా తీసుకుంటారు కానీ నిపుణుల ప్రకారం ఇది శరీరంలో పోషక లోపం లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు. ముందుగా వృద్ధులలో మాత్రమే కనిపించే ఈ సమస్య ఇప్పుడు పిల్లల్లో కూడా కనిపిస్తోంది. పిల్లల జుట్టు రంగు వారి ఆరోగ్యం, ఆహారం, శరీర పరిస్థితిని ప్రతిబింబిస్తుంది. అందుకే ఈ మార్పులను నిర్లక్ష్యం చేయకూడదు.

**విటమిన్ లోపం ప్రధాన కారణం**

పిల్లల్లో జుట్టు తెల్లబడటానికి విటమిన్ బి12, ఐరన్, కాల్షియం, ప్రోటీన్ వంటి పోషకాల లోపం ముఖ్య కారణంగా ఉంటుంది. ఈ పోషకాలు సరిపడా లేకపోతే జుట్టు ఆరోగ్యం దెబ్బతిని త్వరగా తెల్లబడుతుంది.

**వ్యాధుల సూచన కూడా కావచ్చు**

కొన్ని సందర్భాల్లో థైరాయిడ్ సమస్యలు, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, చర్మ సంబంధిత సమస్యలు కూడా జుట్టు రంగు మార్పుకు కారణమవుతాయి. పిల్లలలో జుట్టు వేగంగా తెల్లబడితే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

**వంశపారంపర్యం, జీవనశైలి ప్రభావం**

కుటుంబంలో ఇలాంటి సమస్య ఉంటే పిల్లల్లో కూడా రావచ్చు. అదనంగా, అసమతుల్య ఆహారం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, నిద్రలేమి, ఒత్తిడి వంటి కారణాలు కూడా జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. కాలుష్యం, రసాయనాలతో కూడిన హెయిర్ ఉత్పత్తుల వాడకం కూడా సమస్యను పెంచవచ్చు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

పిల్లల ఆహారంలో ఆకుకూరలు, పండ్లు, పాలు, పప్పులు, ప్రోటీన్ అధికంగా ఉండే పదార్థాలు చేర్చాలి. సరైన నిద్ర, ఒత్తిడి లేని వాతావరణం అవసరం. రసాయన ఉత్పత్తులను తగ్గించాలి. చిన్నపిల్లల్లో జుట్టు తెల్లబడటం చిన్న విషయం అనిపించినప్పటికీ, అది శరీరంలో ఉన్న లోపాలకు సంకేతం కావచ్చు. కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైతే వైద్యుల సలహా తీసుకోవడం చాలా మంచిది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.